


# కాయకన్ను - పూవుకన్ను



బలివాడ కాంతారావు

ఏ వూరు వెళ్ళినా ఒకసారి ఆ వూర్లో తెలిసినవాళ్ళని కలుసుకోవడం నాకో అలవాటుగా అల్లుకుంది.

ఐదేళ్ళ తరవాత చుట్టపు చూపుకు ఒక పట్నం వెళ్లాను. శ్రీనివాసులు ఇంటికి వెళ్ళడానికి బయలుదేరితే "వాళ్లావీథిలో లేరనీ" మా బావ చెప్పాడు.

"స్వంత యిల్లు కదా..."

"అది అమ్మేసారు-రిటైరయిన వెంటనే"

"ఏం?"

"ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు వెయ్యడానికి"

"ఇప్పుడెక్కడ?"

"ఇంచుమించు వూరి చివర. అద్దె ఇంట్లో. ఇల్లు కనుక్కోవడం చాల కష్టమవుతుంది. మావాడు ఇల్లు చూపించి వచ్చేస్తాడు" అని కొడుకును తోడిచ్చాడు.

ఇద్దరం రిక్షాలో వెళ్ళాం. నిజంగా వూరికి చివరే. ఇంటి దగ్గరకు వెళ్లడానికి రోడ్డు వున్నా నాలుగు మలుపులు తిరగనిది ఇల్లు ప్రత్యక్షం కాదు. నన్ను చూడగానే శ్రీనివాసులు పెళ్ళాంతో సహా ముందుకొచ్చి ఆహ్వానించి లోనికి తీసుకు వెళ్ళాడు. ఇల్లు చిన్నదైనా శుభ్రంగా

వుంచుకున్నారు. ఇంటి యెదురుగా చెట్లు పూల మొక్క లున్నాయ్.

ఇంట్లో కాలు పెడ్తూనే అన్నాను.

"రిటయిరయిన వెంటనే పెళ్ళిళ్ళకోసం ఇల్లు అమ్మే సారని విన్నాను...ప్రావిడెంటు ఫండ్‌లో ఆ మాత్ర మైనా మిగల్లేదా?"

"పిల్లల చదువుల క్రింద అయిపోయింది"

"ఆడపిల్లలకి అంత పెద్ద చదువులు చదివించారు. అయినా కట్నాలు పిండుకున్నారు వాళ్ళు. మగ పిల్లలకు అంత పెద్ద చదువులు చదివించారు. వాళ్ళకి ఉద్యోగాలు లేవు..."

ఇంకేదో నేననబోతుంటే శ్రీనివాసులు సహజంగా నవ్వుతూ "చీరుకు తినే పక్షి యేరుకు తింటేగాని బ్రతకదు కదా. ఇందులో వింతేముంది?" అనేసాడు.

"మనిషి పక్షిలా వుంటే ఏదో ఒకనాడు ఆ ముక్కుకు ముల్లు గుచ్చుకోదంటారా?" అని నేనంటే

దంపతులిద్దరూ నవ్వేసారు.

ఇంతలో అంగట ఒక యెర్రని మారుతికారు ఆగింది. అందులో దిగిన మనిషిని నేనిదివరకు చూడ లేదు. చాలా అట్టహాసంగా కనిపిస్తున్నాడు. కదులుతుంటే కడుపు కూడా కదులుతోంది. వేసిన దుస్తులు ఖరీదైన దిగుమతిచేసిన దుస్తుల్లా వున్నయ్. కళ్లద్దాల ఫ్రేమూ ఖరీదైనదే.



ఇటీవల హైదరాబాద్ త్యాగరాయ గానసభలో నర్తించిన కుమారి జ్వాలా శ్రీకళ

"చెల్లెమ్మా! కాఫీ" అంటూనే కాలు పెట్టాడు. నిల్చున్న ముగ్గురం అతను కూర్చుంటేగాని కూర్చో లేదు. కూర్చున్నాక నావేపు ఒకసారి యెగాదిగా చూస్తుంటే శ్రీనివాసులు నన్ను పరిచయం చేస్తాడను కున్నాను. చెయ్యలేదు. నేనే చెప్పకున్నాను. ఇంకా చెప్తూనే వున్నాను. వెంటనే అతను—

"నేనూ శ్రీనివాసులూ క్లాసు మేట్సుమి. వాడు గుమాస్తాగానే చేరి గుమాస్తాగా వుండిపోయాడు. నేను విదేశాలు తిరిగి వచ్చాను. వారానికి ఒక్కసారైనా చెల్లెమ్మ చేసిన కాఫీ తాగకపోతే నాకు తృప్తి వుండదు. పని వుంది చెల్లెమ్మా-అర్జంటు"

శ్రీనివాసులు భార్య శాంతమ్మ లేచి వంటఇంటికి వెళ్ళింది. అక్కడ పడివున్న పేపరు ఒకసారి పట్టుకుని చూచి—

"ఎందుకీ ధర్నాలు, ఎందుకీ యెదురు తిరగడాలీ దేశంలో-ఎందుకింత
యిన్‌డిసిప్లిన్? మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ నేర్పిన విద్య యిది"

అంతటితో ఆగక వుత్తేజంతో ఒకసారి లేచిపోయి చేయి గుండెపై ఆన్చి

"కనీసం నా తరం ఇలాగైనా టెన్షన్స్‌తో బతుకు తోంది. థేంక్ గాడ్! ఈ దేశంలో నా తరవాతి జెనరేషన్సు అన్నీ దోపిడీలకు గురి కావలసిందే. దే విల్ బి రాబ్డ్ ఎట్ ఆల్ ప్లేసెస్, ఎట్ ఆల్ టైమ్స్ అంటూ తల కొట్టుకుని పేపరు క్రింద పడేసాడు ఆ వ్యక్తి.


# మంట • దురద • రక్తం కారడం మూల వ్యాధికి మొదటి లక్షణాలు.

## వెంటనే చికిత్సను మొదలెట్టండి. ఆపరేషన్ చేసే పరిస్థితిని రానియ్యకండి.

మూలవ్యాధి సాధారణంగా వచ్చే వ్యాధి. కాని అశ్రద్ధ చెయ్యడం వల్ల అది ముదిరిపోవచ్చు. అప్పుడిక ఆపరేషన్ చెయ్యవలసి రావచ్చు.

మూలవ్యాధికి ప్రభావంతో పనిచేసే చికిత్స, ప్రెపరేషన్-హెచ్*. దీన్ని విదేశాల్లోని ప్రముఖమైన డాక్టర్లు సిఫార్సు చేస్తారు.

ప్రెపరేషన్-హెచ్ ఔషధయుక్తమైన మలాము, అద్వితీయమైన ఫార్ములా— త్వరగా ఆ బాధ, దురదా నుంచి ఉపశమనం యిచ్చి, నిజానికిది వాపును తగ్గించి మొలలుగల కండరాలను ముడుచుకుపోయేలా చేస్తుంది. ప్రెపరేషన్-హెచ్, అక్కడ జారుడు చేసి, సుఖ విరోచనం అయ్యేలా చేస్తుంది.




* Licensed user of TM: Geoffrey Manners & Co. Ltd.

GM-PH-84-TL-R

"మీరేం చేస్తున్నారు? ఏం పుచ్చుకుని ఏమి చ్చార"ని అడుగుదామనుకుంటే అతనే మళ్ళీ కూర్చుంటూ ఆవేశంతో...

"మన దేశం పెద్ద చెత్తకుండీ-మరుగు దొడ్డి. ఫారిన్ లో ఒక చెత్తకాగితం ముక్క వెతికినా రోడ్డు మీద దొరకదు. ఎక్కడా కరప్షన్ అన్నది కనపడదు. ఎవడి డ్యూటీ వాడు కాన్షస్‌గా చేస్తాడు. ఇక్కడో! ఎక్కడా కరప్షనే-పెద్దా చిన్నా కక్కుర్తి పడుతున్నారు. తిండికి కక్కుర్తి, తిండి దొరికితే మందు కావాలి, మందు దొరికితే ముండ కావాలి. ఈ రెండింటికోసం అధికారం ఇంతో అంతో వుందని అమాయక ప్రజల్ని దోచు కోవడం. ఈ గొర్రెలు ఏం చెయ్యలేవని తెలుసు ఈ అధికారులకు. జడుస్తారని మరీ జడిపించేస్తారు. ఏ గొర్రె పోతో కొమ్ము విసిరితే దాన్ని యేట వేస్తారు. ఈ కంపు సొసైటీని కాల్చి వేయాలి.


అప్పుడే కొత్తసొసైటీ ఈ దేశంలో కొత్తగా మొలు స్తుంది..."

ఇంతలో కాఫీ ముగ్గురికి వచ్చింది. మెల్లగా కాఫీని సిప్ చేస్తున్నాడు. కాఫీ ఇచ్చిన ఆనందం అతను అనుభ విస్తుంటే నేనెందుకు మధ్యను ప్రశ్న వెయ్యాలని వూరుకున్నాను. కాఫీ తాగిన వెంటనే నా ధర్మ సందేహాలు తీర్చుకుందామంటే నాకు అవకాశం ఇవ్వ కుండానే గలగలా మాటల ప్రవాహం ...

"మనది కేస్టు బేస్‌డ్ సొసైటీ. కులం మన సొసైటీ కంటిన కేన్సర్. ఈ కేన్సర్ బాగుచేసే మందు మనం కనిపెట్టలేదు. ఈ పొలిటికల్ డాక్టర్లు కబుర్లు చెప్పిన వాళ్లే. కుదుర్చలేరు. డాక్టరు కూడా ఈ కేన్సర్ రోగే అని మరిచిపోకండి.మన శ్రీనివాసులు కట్నాలివ్వడానికి ఇల్లెందుకు అమ్మేశాడు? తన జాతి అల్లుళ్ళు కావాలనే కదా! కోరినది ఇచ్చినా, సరిగా ఏలుకుంటాడని ఎక్కడ? ఏలుకోపోతే- వీథిలో పడితే పరువు నష్టం. హెల్ విత్ పరువు. హెల్ విత్ సాంప్రదాయం. మనం మేకలం. మారలేం. తెల్లదొర మేక అయిపోయి పారిపోయాడు గానీ మనం పులులై పారదోలలేదు. అలా చేసినవాళ్ళు అల్జీరియన్సు. పులిలాంటి పొలిటీషియన్ పుడితేగానీ ఈ దేశం బాగుపడదు. సర్జనులా పేగులు కోసినవాడే ఈ దేశాన్ని ఆరోగ్యంగా వుంచగలడు!"

నా సంశయాలు తీర్చుకుందామంటే చప్పున లేచి పోయి...

"నాకే అధికారంఇస్తే ముందు ఈ బాబాలనందర్నీ కొట్లో తోసేస్తాను. మూఢనమ్మకాలతో మనల్ని నూతిలో కప్పలు చేస్తున్నారు. రోగులెందుకు చచ్చిపోతు న్నారీ దేశంలో? అమ్మిన మందులలో మందులు లేవు- మాయ వుంది, మోసం వుంది. తిన్న తిండిలో కంటికి ఆనని పురుగులున్నాయ్. అంతా బాక్టీరియా మహత్యం. అందుకే ఈ దేశంలో ఇప్పుడు భూకంపాలు అధికమౌతు న్నాయ్. ఎప్పుడో భూమి ప్రబద్దలైపోయి..." అంటూ చప్పున చల్లబడిపోయి "వస్తాను" అని నవ్వుతూ వెళ్ళి పోయాడు. డ్రైవరు కారు తలుపు తీశాడు. చేతు లూపుతూ వెళ్లాడు. అతను వెళ్లాక శాంతమ్మ వంట ఇంటికి వెళ్లింది. శ్రీనివాసులూ నేనూ గదిలో కూర్చు న్నాము.




"ఎవరీయన" అన్నాను.

"మనవాడే- మంచివాడు"

"కారున్న వాళ్లంతా మంచివాళ్లా?" అన్నాను నవ్వుతూ.

"అతను అలా ఎబ్బెట్టుగా మాటాడుతున్నాడని అనుకుంటున్నావేమో?"

"అదేపనిగా తన అభిప్రాయాన్నే బల్లగుద్దివట్టు బాదుతుంటే విసుగెత్తదా? కొంపతీసి తాగి వచ్చాడా?"

"తాగడు"

"పై దేశాలు వెళ్లినవాడు తాగడని నమ్మమం టావా?"

"నేను చూడనిది తాగుతాడని నేనెలా చెప్పేది."

"ఈ వేషం, ఈ కారు అంతా చూస్తుంటే బాగా దోచినవాడిలా వున్నాడు. అలాంటి వాళ్లే ఇలాంటి కబుర్లు చెప్తారు సాధారణంగా"

"కష్టపడ్డాడు. గడించాడు. తప్పేం వుంది?"

"గడించి సుఖపడ్తున్నాడా?"

"సుఖం సున్న లాంటిది. మనిషి అంకె లాంటి వాడు. మనిషిని బట్టి సుఖానికి విలువ పెరుగుతుంది"

"ఇతని విలువెంత?" అడిగాను సూటిగా.

"నాకు అంకెలే తెలియనప్పుడు అంకెల విలువ కట్టగలనా?" అని శ్రీనివాసులు చిరునగవుతో అన్నాడు.

"పోనీ నీలా అరిగిన గంధపు చెక్కా, లేకపోతే అతగాడు విరిగిన చెట్టు కొమ్మా?" అని అడిగాను.

శ్రీనివాసులు అప్పుడే వంట ఇంటి నించి వస్తున్న పెళ్లాం వేపు చూసి అన్నాడు.

"ఇప్పుడు వెళ్లిన, మీ ఉమాపతి అన్నయ్య అరిగిన గంధపు చెక్కా, విరిగిన చెట్టు కొమ్మా అని, మీ తమ్ముడు అడుగుతున్నాడు."

"ఉమాపతి అన్నయ్య ఎప్పుడూ అలా మాటాడు తునే వుంటాడు" అంది నవ్వుతూ ఆమె.

"ఎదుటివాళ్లని మాటాడనివ్వడు. అంతా వాడికే తెలిసినట్టు" అన్నాను.

"ఉమాపతి అన్నయ్యకు పాపం ఈ కాలానికి చెముడు వచ్చింది. తనకు చెముడుందని ఎదుటివాళ్ళు తెలుసుకోకూడదని అలా తనే గట్టిగా మాటాడేస్తుం టాడు" ఈ మాటలు విని నవ్వుకున్నానే గానీ ఆలోచ వలో పడ్డాను.

"చెముడు దాచుకోవాలని ప్రయత్నిస్తున్నవాడు... ఇంకెన్నెన్నో అనర్థాలు దాచుకోడానికి ప్రయత్నించ వచ్చుకదా..." అనిపించి అదేదో తెలుసుకుందామని శ్రీనివాసుల్ని అడిగాను.

"మందులు మోసం అని అన్నాడంటే... మందులు వాడి మోసపోయాడా?" అడిగాను.

"అది నాకు తెలీదు గానీ... అతని పెళ్లాం పోయి మూడేళ్లయింది"

"మరి జాతిని దుయ్యబట్టాడెందుకు?"

"అందమైన కూతురు. బాగా చదివించాడు. ఎందరో పై జాతి కుర్రాళ్ళు చేసుకుంటామని కోరి వచ్చారు. కాని జాతి కుర్రాడ్ని వెతికాడు. వెతగ్గా వెతగ్గా దొరికాడు. వాళ్ళు కోరినంత ఇచ్చాడు. ఐనా వాడు ఏకు మేకైపోయి పెళ్లాన్ని నానా హింసలు పెట్టాడు. కూతురు యేక్సిడెంట్‌లో చచ్చిపోయిందని తేల్చారు గానీ, బలవంతంగా మొగుడే చంపేశాడు."

"కొడుకు లెవరన్నా వున్నారా?"

"ఉన్నవాడొక్కడే. వాడివంతా హైక్లాసు అల వాట్లు. వాళ్లిద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గున మండు తుంది. వేరే వున్నాడు. ఇప్పుడు ఇతను ఒంటరివాడు. అంత పెద్ద ఇల్లు- బోరుగా వుంటుంది. ఇలా మా ఒక్క ఇల్లే కాదు, ఇలా ఎన్ని ఇళ్ళల్లోనో తిరిగి ఇలాగే ంటు అంటుంటాడు" చిరునగవుతోనే శ్రీనివాసులు అన్నాడు.

ఉమాపతి అరుచుకుంటూ తన బాధలు దాచుకుం టుంటే, శ్రీనివాసులు నవ్వుకుంటూ తన బాధలు భరిస్తున్నాడనుకున్నాను. అతనిది కాయకన్ను అయితే, ఇతనిది పూవు కన్ను. రెండు కళ్లల్లోనూ నీరు చిమ్ము తాయి.